సాక్షి
కుమురం భీం
గురువారం । 4 । జూలై । 2024



గనుల వేలంపై నిరసనల వెల్లువ

బొగ్గు గనుల వేలంపై టీజీబీకేఎస్‌తోపాటు పలు సంఘాలు నిరసన తెలిపాయి. నాయకులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మలు దహనం చేశారు.

8లో▸

వట్టివాగు ప్రాజెక్టు నీటి విడుదల



ఆసిఫాబాద్‌రూరల్‌: వట్టివాగు ప్రాజెక్టు గేట్లను ఎత్తి బుధవారం దిగువకు నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి సామర్థ్యం 2.89 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 1.17 టీఎంసీల నీటి నిల్వ ఉందని ప్రాజెక్టు అధికారులు వెల్లడించారు.

గరిష్టం/కనిష్టం
33.0 /26.0

వాతావరణం

ఆకాశం రోజంతా మేఘావృతమై ఉంటుంది. రుతుపవనాల ప్రభావంతో పలు ప్రాంతాల్లో వర్షం కురిసే అవకాశం ఉంది.

రుణ ప్రణాళిక ఖరారు

- 2024- 25 రుణ లక్ష్యం రూ.2892.16 కోట్లు
- గతేడాది కంటే 8.26 శాతం అధికంగా కేటాయింపులు
- లక్ష్య సాధనపై జిల్లా అధికారులకు కలెక్టర్‌ దిశానిర్దేశం



కలెక్టరేట్‌లో వార్షిక రుణ ప్రణాళిక బ్రోచర్‌ ఆవిష్కరిస్తున్న కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే, బ్యాంకర్లు, అధికారులు

ఆసిఫాబాద్‌: జిల్లా వార్షిక రుణ ప్రణాళిక ఖరారైంది. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌ సమావేశ మందిరంలో బుధవారం బ్యాంకర్లతో నిర్వహించిన సమావేశంలో 2024- 25 వార్షిక రుణ ప్రణాళికను అధికారులు విడుదల చేశారు. గతేడాది మాదిరిగానే ఈసారి కూడా వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇచ్చారు. పంట రుణాలతోపాటు వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు, మహిళా సంఘాలు, ఇతర రుణాలు అందించేందుకు ప్రణాళిక రూపొందించారు. 2024- 25 ఆర్థిక సంవత్సరానికి రూ.2892.16 కోట్లు రుణ లక్ష్యం కాగా, వీటిలో రూ.1621.29 కోట్ల పంట రుణాలు, రూ.668.57 కోట్ల వ్యవసాయ టర్మ్‌ రుణాలు ఉన్నాయి.

రైతులకు బ్యాంకు రుణాలే ఆధారం

జిల్లాలో 1.38 లక్షల మంది రైతులు ఉన్నారు. ఈ ఏడాది వానాకాలంలో 3,40,000 ఎకరాల పత్తి సాగవుతుండగా.. 59,212 ఎకరాల్లో వరి, 680 ఎకరాల్లో జొన్న, 742 ఎకరాల్లో మొక్కజొన్న, 38,239 ఎకరాల్లో కంది, 1700 ఎకరాల్లో పెసర, 163 ఎకరాల్లో మినుము, 178 ఎకరాల్లో వేరుశనగ, 6,089 ఎకరాల్లో సోయాబీన్‌, 2,152 ఎకరాల్లో ఇతర పంటలు సాగవుతాయని వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఈ ఏడాది తెలంగాణ ప్రభుత్వం రైతుబంధు నగదు ఇప్పటివరకు పూర్తిస్థాయిలో రైతుల ఖాతాల్లో జమ చేయలేదు. మృగశిర కార్తె ప్రవేశించడంతో అన్నదాతలు వ్యవసాయ పనులు ముమ్మరం చేశారు. ఇప్పటికే విత్తనాలు విత్తుకున్న వారు మొలకెత్తని స్థానాల్లో రెండోసారి వేస్తున్నారు. ఈ క్రమంలో రైతులకు పంట రుణాలు సకాలంలో అందించాల్సి ఉంది. బోర్లు, వ్యవసాయ బావులు లేకపోవడంతో జిల్లాలో మెజార్టీ శాతం వర్షాధారంగానే పంటలు సాగవుతాయి. రైతులు పంట పెట్టుబడులకు కోసం బ్యాంకుల ద్వారా ప్రభుత్వం అందించే రుణాలపైనే ఆధారపడుతున్నారు.

వార్షిక రుణ ప్రణాళిక(రూ.కోట్లలో)

సెక్టార్‌	2023- 24	2024- 25	పెరుగుదల	శాతం
పంట రుణాలు	1519.40	1621.29	101.88	6.28
వ్యవసాయ టర్మ్‌ రుణాలు	604.94	668.57	63.62	9.51
మొత్తం అగ్రికల్చర్‌ క్రెడిట్‌	2124.34	2289.86	165.51	7.22
ఎంఎస్‌ఎంఈ	265.60	260.00	- 560	- 2.15
ఇతర ప్రాధాన్యత రంగాలు	127.16	156.28	29.11	18.63
మొత్తం ప్రాధాన్యత రంగాలు	2517.11	2706.14	189.02	6.98
అప్రాధాన్యత రంగాలు	135.94	186.02	50.09	26.93
మొత్తం	2653.03	2892.16	239.12	8.26

అదనపు కేటాయింపులు

2023- 24 ఆర్థిక సంవత్సరంలో పోల్చితే ఈసారి రుణ ప్రణాళికలో 8.26 శాతం అదనంగా నిధులు కేటాయించారు. గతేడాది రూ.2653.03 కోట్లు కేటాయించగా ఈ ఏడాది రూ.2892.16 కోట్లు ఖరారు చేశారు. అదనంగా రూ.239.12 కోట్లు అధికంగా కేటాయించారు. ఈ ఏడాది రుణ లక్ష్యాన్ని వందశాతం సాధించాలని కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే అధికారులను ఆదేశించారు. రైతులతోపాటు మహిళా సంఘాలు, అర్హులైన లబ్ధిదారులకు రుణాలు అందించాలని ఐకేపీ అధికారులకు సూచించారు. దీంతోపాటు చిన్న పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన రుణాలు అందిస్తేనే రుణలక్ష్యం నెరవేరే అవకాశం ఉంది. బ్యాంకు అధికారులు సైతం వ్యవసాయ రుణాలు, మహిళా సంఘాల రుణాలపైనే దృష్టి సారించనున్నారు.

నిర్దేశిత రుణ లక్ష్యాలు సాధించాలి

- కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే



మాట్లాడుతున్న కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే

ఆసిఫాబాద్‌: బ్యాంకర్లు నిర్దేశిత రుణ లక్ష్యాలు సాధించాలని కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌ సమావేశ మందిరంలో బుధవారం జిల్లా అధికారులు, బ్యాంకర్లతో జిల్లాస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. కలెక్టర్‌ మాట్లాడుతూ 2024- 25 ఆర్థిక సంవత్సరాలనికి నిర్దేశించిన రుణలక్ష్యాలు సకాలంలో పూర్తి చేసేందుకు బ్యాంకర్లు సమన్వయంతో పని చేయాలన్నారు. రైతులు, మహిళా సంఘాలు, అర్హులైన వారికి వందశాతం రుణాలు అందించాలన్నారు. పేదలకు ఆర్థిక చేయూతనందించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి జన్‌ధన్‌ యోజన, జీవన జ్యోతి, సురక్ష, బీమా యోజన, అటల్‌ పెన్షన్‌ యోజన సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. లబ్ధిదారులు రుణాలు క్షేత్రస్థాయిలో సద్వినియోగం చేసుకునే విధంగా బ్యాంకర్లు, అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. రైతులకు వ్యవసాయ, పంట రుణాలు పొందడంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా చర్యలు చేపట్టాలన్నారు. షెడ్యూల్‌ కులాలు, వెనకబడిన తరగతులు, మైనార్టీ కార్పొరేషన్లు, ట్రైకార్‌ ద్వారా మంజూరైన యూనిట్లకు దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులను గుర్తించి, అవసరమైన మేర రుణం అందించాలన్నారు. మహిళా శక్తి పథకంలో భాగంగా మహిళా సంఘాలు చేపల పెంపకం, డెయిరీ ఫాం, కోళ్ల పెంపకం, క్యాంటీన్లు, కుట్టు శిక్షణా కేంద్రాల ఏర్పాటుకు సహకరించాలని సూచించారు. అలాగే బ్యాంకు లావాదేవీలు, ఆర్థిక అక్షరాస్యత, సైబర్‌ నేరాలపై గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని సూచించారు. 2024- 25 ఆర్థిక సంవత్సరానికి పంట రుణాలు, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల రుణాలు, ప్రాధాన్యత, ప్రాధాన్యయేతర రంగాలకు సంబంధించి రుణ సదుపాయం కల్పిస్తున్నామని తెలిపారు. సమావేశంలో డీఆర్‌డీవో సురేందర్‌, రిజర్వ్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా అధికారి సాయితేజరెడ్డి, నాబార్డ్‌ డీడీ ఎం.వీరభద్రుడు, లీడ్‌ బ్యాంకు మేనేజర్‌ రాజేశ్వర్‌ జోషి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్‌

స్టాక్‌ బోర్డులు ఏర్పాటు చేయాలి



రిజిస్టర్‌ పరిశీలిస్తున్న డీఏవో శ్రీనివాసరావు

లింగాపూర్‌(ఆసిఫాబాద్‌): విత్తన డీలర్లు తమ షాపుల ఎదుట విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల నిల్వకు సంబంధించిన స్టాక్‌ బోర్డులు ఏర్పాటు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంలోని ఆగ్రోస్‌ ఎరువుల దుకాణాన్ని బుధవారం తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. అనంతరం డీఏవో మాట్లాడుతూ విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు కొనుగోలు చేసే సమయంలో రైతులు తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. తప్పనిసరిగా రశీదులు తీసుకోవాలని సూచించారు. నకిలీ మందులు, అధిక ధరలతో మోసం చేస్తే నేరుగా వ్యవసాయశాఖ అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే డీలర్ల లైసెన్స్‌లు రద్దు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట ఏఈవో తొడసం శ్రీనివాస్‌ తదితరులు ఉన్నారు.

6న ఫుట్‌బాల్‌ జట్టు ఎంపిక

ఆసిఫాబాద్‌రూరల్‌: జిల్లా కేంద్రంలోని పీటీజీ బాలికల ఉన్నత పాఠశాలలో ఈ నెల 6న సబ్‌జూనియర్‌ అండర్‌ 13 బాలికల ఉమ్మడి ఆదిలాబాద్‌ జిల్లా జట్టు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్‌ అనిత, ఫుట్‌బాల్‌ అసోసియేషన్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి రఘునాథ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలో పాల్గొనే బాలికలు 2011 జనవరి 1లోపు జన్మించి ఉండాలని పేర్కొన్నారు. విద్యార్థులు ఆధార్‌కార్డు, బోనఫైడ్‌, బర్త్‌ సర్టిఫికెట్‌తో పాఠశాలకు రావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 99857 88989 సంప్రదించాలని కోరారు.

దివ్యాంగుల పింఛన్‌ మొత్తాన్ని పెంచాలని వినతి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్‌: దివ్యాంగులకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న పింఛన్‌ రూ.300 నుంచి రూ.3వేలకు పెంచాలని, రాష్ట్ర ప్రభుత్వం రూ.3వేల నుంచి రూ.6వేలకు పెంచాలని ఎన్‌పీఆర్‌డీ జిల్లా అధ్యక్షుడు పి.రాజేశ్‌, కార్యదర్శి ఆనంద్‌కుమార్‌ కోరారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో బుధవారం కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రేకు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ ఎన్నికల హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం పెంచిన ఫించన్లు అందించాలని డిమాండ్‌ చేశారు. కొత్తగా దరఖాస్తు చేసుకున్న 24.84 లక్షల మందికి ఇప్పటికీ పింఛన్లు మంజూరు కాలేదని తెలిపారు. 2014లో ఆసరా పెన్షన్ల మంజూరుకు విధించిన ఆదాయ పరిమితిని రద్దు చేయాలని డిమాండ్‌ చేశారు. ప్రభుత్వ శాఖల్లోని దివ్యాంగుల బ్యాక్‌లాగ్‌ పోస్టుల గుర్తింపు కోసం ప్రత్యేక డ్రైవ్‌ నిర్వహించాలని కోరారు. మహిళా శక్తి క్యాంటీన్లలో దివ్యాంగులకు ఐదు శాతం కేటాయించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జాకీర్‌, సప్తగిరి, లక్ష్మి, రాజు, కల్యాణ్‌, అంకన్న తదితరులు ఉన్నారు.

విద్యాసంస్థల బంద్‌ విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న సాయికృష్ణ

కాగజ్‌నగర్‌రూరల్‌: నీట్‌ రద్దు చేసి తిరిగి పరీక్ష నిర్వహించాలని, పేపర్‌ లీకేజీపై సుప్రీం కోర్టు సిట్టింగ్‌ జడ్జితో విచారణ చేపట్టాలనే డిమాండ్లతో గురువారం నిర్వహించే విద్యాసంస్థల బంద్‌ విజయవంతం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి సాయికృష్ణ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎస్‌ఎఫ్‌ఐ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని, జాతీయ పరీక్షల సమగ్రతకు కృషి చేయాలన్నారు. జిల్లా అధ్యక్షుడు సాయికుమార్‌, నాయకులు కార్తీక్‌, పవన్‌ పాల్గొన్నారు. కాగా.. విద్యార్థి, యువజన సంఘాల ఐక్య కార్యాచరణ కమిటీ ఇచ్చిన దేశవ్యాప్త విద్యాసంస్థల బంద్‌కు సీపీఐ(ఎం) కాగజ్‌నగర్‌ డివిజన్‌ కమిటీ పూర్తి మద్దతిస్తుందని నియోజకవర్గ కన్వీనర్‌ ముంజం ఆనంద్‌కుమార్‌ తెలిపారు. విద్యాసంస్థల బంద్‌ జయప్రదం చేయాలని కోరారు.

ప్రతీ ఫిర్యాదు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

- ఎస్పీ డీవీ శ్రీనివాసరావు



సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ శ్రీనివాసరావు

వాంకిడి(ఆసిఫాబాద్‌): పోలీసు స్టేషన్‌కు వచ్చే ప్రతీ ఫిర్యాదును ఆన్‌లైన్‌లో నమోదు చేసి, ఫిర్యాదుదారులకు రశీదులు అందించాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్‌ స్టేషన్‌ను బుధవారం తనిఖీ చేశారు. రికార్డులతోపాటు స్టేషన్‌ పరిసరాలను పరిశీలించారు. గదులు, రికార్డులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పెండింగ్‌ కేసులు వేగంగా పరిష్కరించాలని ఎస్సైను ఆదేశించారు. ఫిర్యాదులపై వేగంగా స్పందించి చర్యలు తీసుకోవాలన్నారు. మండల పరిధిలోని అన్ని గ్రామాలపై పోలీసు సిబ్బంది అవగాహన ఉండాలన్నారు. చోరీలకు అవకాశం లేకుండా 24 గంటలు పెట్రోలింగ్‌ నిర్వహించాలన్నారు. డయల్‌ 100కు సమాచారం అందిన వెంటనే స్పందించాలని సూచించారు. రౌడీషీటర్లు, పాత నేరస్తులపై నిత్యం నిఘా ఉంచాలన్నారు. ప్రజలకు అన్ని వేళలా అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. ఆయన వెంట ఎస్‌బీ సీఐ రాణాప్రతాప్‌, వాంకిడి సీఐ శ్రీనివాస్‌, ఎస్సై సాగర్‌, ఆర్‌ఎస్సై ఓదేలు, సిబ్బంది ఉన్నారు.

పీవీటీజీ అడహక్‌ కమిటీ ఎన్నిక



ఎన్నికైన సభ్యులు

ఆసిఫాబాద్‌అర్బన్‌: జిల్లా కేంద్రంలోని ఆదివాసీ భవనంలో బుధవారం కొలాం, తోటి సంఘం నాయకుల ఆధ్వర్యంలో జిల్లా పీవీటీజీ అడహక్‌ కమిటీ ఎన్నిక నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడిగా మడావి మాన్కు, ప్రధాన కార్యదర్శిగా వెంకటేశ్‌ చహకటి, ఉపాధ్యక్షుడిగా ఆత్రం రవీందర్‌, కార్యదర్శిగా తిరుపతి, కోశాధికారిగా గణేశ్‌, సలహాదారులుగా తిరుపతి, సీతారాం, సుధాకర్‌, దస్రు, భీంరావును ఎన్నుకున్నారు.

‘ఆపరేషన్‌ ముస్కాన్‌’ షురూ



కాగజ్‌నగర్‌ రైల్వేస్టేషన్‌లో తనిఖీ బృందం(ఫైల్‌)

- బాలకార్మికుల విముక్తి కోసం రెండు బృందాల ఏర్పాటు
- నెల రోజులపాటు విస్తృతంగా తనిఖీలు
- బాలలను పాఠశాలల్లో చేర్పించేందుకు చర్యలు

పెంచికల్‌పేట్‌(సిర్పూర్‌): బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించి బందీలుగా ఉన్న చిన్నారుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా ఏటా ఆపరేషన్‌ ముస్కాన్‌ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. జూలై 1న ప్రారంభమైన పదో విడత ఆపరేషన్‌ ముస్కాన్‌ కార్యక్రమం ఈ నెల 31 వరకు కొనసాగనుంది. నెలరోజుల పాటు ఆసిఫాబాద్‌, కాగజ్‌నగర్‌ డివిజన్ల పరిధిలో తనిఖీలు చేపట్టేందుకు రెండు బృందాలను ఏర్పాటు చేశారు. బాలకార్మికుల స్థావరాలుగా నిలిచే పరిశ్రమలు, వ్యాపార సముదాయాలు, గోదాములు, హోటళ్లు, మెకానిక్‌ షాపులు, ఇటుక బట్టీలు, ఇతర పారిశ్రామిక ప్రాంతాల్లో దాడులు నిర్వహించనున్నారు. గతేడాది నిర్వహించిన ఆపరేషన్‌ ముస్కాన్‌- 9 కార్యక్రమంలో భాగంగా జిల్లావ్యాప్తంగా తనిఖీలు నిర్వహించి 49 మంది చిన్నారులను గుర్తించారు. వీరిలో బాలకార్మికులు 40 మంది ఉండగా.. బాల్యవివాహం జరిగిన ఇద్దరు, బడిమానేసిన పిల్లలు ఏడుగురు ఉన్నారు. తల్లిదండ్రులకు కౌన్సెలింగ్‌ నిర్వహించి పిల్లలను అప్పగించారు. 2019 నుంచి ఇప్పటివరకు నిర్వహించిన ‘ఆపరేషన్‌ ముస్కాన్‌’లో బాలురు 271, బాలికలు 27 మందిని గుర్తించగా.. మొత్తం 298 మందికి విముక్తి కల్పించారు.

రెండు డివిజన్లు.. రెండు బృందాలు

జిల్లాలో మొత్తం 334 గ్రామ పంచాయతీలు ఉండగా.. రెండు మున్సిపాలిటీలు ఉన్నాయి. జిల్లా కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే నేతృత్వంలో పోలీసు అధికారులు, శిశుసంరక్షణ, కార్మిక, బాలల హక్కుల పరిరక్షణ సమితి, విద్యాశాఖ సమన్వయంతో ఆసిఫాబాద్‌, కాగజ్‌నగర్‌ డివిజన్లలో బందీలుగా ఉన్న బాలలను గుర్తించడానికి రెండు బృందాలను ఏర్పాటు చేశారు. కాగజ్‌నగర్‌ డివిజన్‌ బృందంలో ఎస్సై రాజయ్య, ఆసిఫాబాద్‌ డివిజన్‌ బృందంలో ఎస్సై రాములుతో చైల్డ్‌ ప్రొటెక్షన్‌ అధికారి, ఇద్దరు కానిస్టేబుళ్లు, ఒక మహిళా కానిస్టేబుల్‌, కార్మిక శాఖ నుంచి ఒకరిని సభ్యులుగా నియమించారు. వీరు తప్పిపోయిన పిల్లలు, అనాథలు, వీధిబాలలను గుర్తిస్తారు. అలాగే రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, హోటళ్లు, దాబాలు, మిల్లులు, ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న పిల్లలకు విముక్తి కల్పిస్తారు. చిన్నారుల తల్లిదండ్రులకు కౌన్సిలింగ్‌ నిర్వహిస్తారు. అనాథ బాలికలను జిల్లా కేంద్రంలోని వసతి గృహాలకు తరలించి ఉచితంగా విద్యా, వైద్యం, భోజన వసతి కల్పించనున్నారు. అయితే కాగజ్‌నగర్‌ డివిజన్‌ నుంచి అనేక కుటుంబాలు మంచిర్యాల, పెద్దపల్లి, కరీంనగర్‌, హైదరాబాద్‌ వంటి పట్టణాలకు వలస వెళ్తుంటాయి. అక్కడే రైసు మిల్లులు, ఇటుక బట్టీలు, ఇతర పరిశ్రమల్లో పని చేస్తున్నారు. అధికారులు వీరిపైనా దృష్టి సారించి తల్లిదండ్రుల వెంట పనుల్లో ఉన్న చిన్నారులను గుర్తించాల్సి ఉంది.

సమాచారం అందించాలి

రాజ్యాంగం బాలలకు హక్కులు కల్పించింది. వారి హక్కులను కాలరాస్తూ పనిలో పెట్టుకుంటే చట్టప్రకారం కేసు నమోదు చేస్తాం. బడీడు పిల్లలను తల్లిదండ్రులు పాఠశాలల్లో చేర్పించాలి. రెండు బృందాలతో జిల్లాలో పకడ్బందీగా తనిఖీలు చేపడతాం. దాడుల్లో పట్టుబడితే యజమానులపైనా కేసులు నమోదు చేస్తాం. ఎక్కడైనా బాలకార్మికులు కనిపిస్తే వెంటనే డయల్‌ 100 లేదా 1098 టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలి.
– బి.మహేశ్‌, జిల్లా బాలల సంరక్షణ అధికారి

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



బహుమతి ఇస్తున్న డీఈవో అశోక్‌

కాగజ్‌నగర్‌రూరల్‌: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని డీఈవో అశోక్‌ అన్నారు. పట్టణంలోని సర్‌సిల్క్‌ మండల పరిషత్‌ ప్రాథమిక పాఠశాలలో జిల్లాలోని 19 ఉన్నత పాఠశాల విద్యార్థులకు ‘ప్రపంచ పర్యావరణ దినోత్సవ ప్రాముఖ్యత’ అనే అంశంపై బుధవారం పోస్టర్‌ మేకింగ్‌, పద్యరచన పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. డీఈవో మాట్లాడుతూ పర్యావరణం, మానవ జీవితంపై ఒకదానిపై ఒకటి ముడిపడి ఉన్నాయన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించుకుంటే.. అది మెరుగైన మానవ జీవితానికి, జీవన విధానానికి తోడ్పడుతుందని పేర్కొన్నారు. మొక్కలు నాటాలని, నీటిని పొదుపుగా వాడుకోవాలని సూచించారు. కాలుష్యం పెరగకుండా పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. జిల్లా సైన్స్‌ అధికారి కటకం మధుకర్‌ మాట్లాడుతూ విద్యార్థులు పర్యావరణ పరిరక్షణ గురించి ప్రతీ ఒక్కరికి వివరించాలని సూచించారు. కార్యక్రమంలో నోడల్‌ అధికారి దేవాజీ, ప్రధానోపాధ్యాయురాలు ప్రమీల, 19 ఉన్నత పాఠశాలల నుంచి 190 మంది విద్యార్థులు, 19 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మండల పరిషత్‌లకు ప్రత్యేకాధికారులు

- ముగిసిన పాలకవర్గాల పదవీకాలం
- ప్రత్యేకాధికారులుగా ఉద్యోగులకు బాధ్యతలు
- ఉత్తర్వులు జారీ చేసిన కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే



ఆసిఫాబాద్‌: మండల ప్రజాపరిషత్‌ల కార్యవర్గాల స్థానంలో ప్రత్యేకాధికారులను నియమిస్తూ కలెక్టర్‌ వెంకటేశ్‌ దోత్రే బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే సర్పంచుల పదవీ కాలం ముగియగా పంచాయతీల్లో ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతున్న విషయం తెలిసిందే. స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రభుత్వం స్పష్టతనివ్వకపోవడంతో మండల ప్రజాపరిషత్‌లకు ప్రభుత్వ ఉద్యోగులను ప్రత్యేకాధికారులుగా నియమించారు.

గురువారం నుంచి అమల్లోకి..

ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీలకు గత ఫిబ్రవరి నుంచి ప్రత్యేకాధికారులు కొనసాగుతున్నారు. ఎంపీపీటీసీల పదవీకాలం ఈ నెల 3తో ముగియడంతో ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించింది. ఈ నెల 4(గురువారం) నుంచి ఉత్తర్వులు అమల్లోకి వస్తాయని పేర్కొన్నారు. ప్రత్యేకాధికారులుగా ఆసిఫాబాద్‌ మండలానికి ఆర్డీవో లోకేశ్వర్‌రావును నియమించగా.. బెజ్జూర్‌కు జిల్లా ఉద్యానవనశాఖ అధికారి ఎం.వెంకటేశం, చింతలమానెపల్లికి జిల్లా వ్యవసాయాధికారి రాపూరి శ్రీనివాసరావు, దహెగాం ఆర్‌అండ్‌బీ ఈఈ పెద్దన్న, జైనూర్‌ ఇరిగేషన్‌ ఈఈ గుణవంత్‌ రావు, కాగజ్‌నగర్‌కు కాగజ్‌నగర్‌ ఆర్డీవో కాశబోయిన సురేశ్‌, కెరమెరి జెడ్పీ డిప్యూటీ సీఈవో ఆర్‌.లక్ష్మీనారాయణ, కౌటాల డీఆర్‌డీవో సురేందర్‌, లింగాపూర్‌ జిల్లా పశువైద్యాధికారి డాక్టర్‌ ఎం.సురేశ్‌కుమార్‌, పెంచికల్‌పేట్‌ ఇరిగేషన్‌ ఈఈ ఆర్‌.ప్రభాకర్‌రావు, రెబ్బెన డీపీవో భిక్షపతి, సిర్పూర్‌–టి డీపీఆర్‌ఈ(పీఐయూ) ప్రభాకర్‌, సిర్పూర్‌(యూ) జిల్లా సంక్షేమ అధికారి ఏ.భాస్కర్‌, తిర్యాణి గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌ ఆర్‌.రమాదేవి, వాంకిడి మండలానికి మిషన్‌ భగీరథ ఈఈ వెంకటపతిని నియమిస్తూ కలెక్టర్‌ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక నుంచి పంచాయతీలతోపాటు మండల పరిషత్‌ల్లోనూ ప్రత్యేకాధికారుల పాలన కొనసాగనుంది.

ఆదివాసీ ఎమ్మెల్యేపై మీ పెత్తనమేంటి?

- కాంగ్రెస్‌ నాయకులపై ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆగ్రహం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌అర్బన్‌: ఆదివాసీ మహిళా ఎమ్మెల్యేపై కాంగ్రెస్‌ నాయకుల పెత్తనమేంటని ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని తన నివాసంలో బుధవారం ఆదివాసీ, బీఆర్‌ఎస్‌ పార్టీ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలో తనకు లభిస్తున్న ఆదరణను ఓర్వలేకే డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు కక్షపూరితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. తమ అనుచరులను బెదిరిస్తూ కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. బీఆర్‌ఎస్‌ హయాంలో మంజూరైన అభివృద్ధి పనులను ప్రారంభిస్తూ.. ఆదివాసీ నాయకురాలు ఆత్రం సుగుణను అడ్డుపెట్టుకుని నాపై ఆరోపణలు చేయడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్‌ పాలనలో చేపట్టిన అభివృద్ధిపై అంబేద్కర్‌ చౌక్‌ వద్ద బహిరంగ చర్చకు రావాలని సవాల్‌ విసిరారు. పదేళ్ల బీఆర్‌ఎస్‌ హయాంలో కాంగ్రెస్‌ నాయకులపై ఎలాంటి దాడులు చేయలేదని, అక్రమంగా కేసులు పెట్టలేదని స్పష్టం చేశారు. చిల్లర రాజకీయాలు చేస్తే సహించేది లేదన్నారు. ఆదివాసీల జోలికి వస్తే సహించమని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు సరస్వతి, బుర్స పోచయ్య, పుష్పలత, నర్సింగ్‌రావు, కనక యాదవ్‌రావు, అబ్దుల్‌ కలాం, అలీబిన్‌ అహ్మద్‌, జెడ్పీటీసీలు అజయ్‌, ద్రుపదాబాయి, ఎంపీపీ సౌందర్య, పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

జైనూర్: మతిస్థిమితం కోల్పోయిన వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సందీప్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పోచంలొద్ది గ్రామానికి చెందిన శేక్ ఆరిఫ్(32) మూడేళ్లుగా మతిస్థిమితం కోల్పోయాడు. ఆర్థిక పరిస్థితులు బాగా లేకపోవడంతో బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు.

ఆన్‌లైన్ మట్కా ఆడుతున్న ఒకరిపై కేసు

కాగజ్‌నగర్ రూరల్: పట్టణంలోని నవేగాం బస్తీకి చెందిన మహ్మద్ అఫ్రోజ్ బుధవారం ఆన్‌లైన్‌లో మట్కా ఆడుతుండగా పట్టుకుని అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అంజయ్య తెలిపారు. అఫ్రోజ్ నుంచి 18 వేల రూపాయల నగదుతో పాటు సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ సర్పంచ్ మృతి


సంగీతరావు(ఫైల్)

తాండూర్: మండలంలోని కొత్తపల్లి గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ చీమల సంగీతరావు (68) రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. రేపల్లెవాడ చర్చి సమీపంలో నివాసం ఉండే సంగీతరావు మంగళవారం రాత్రి తన బైక్‌పై తాండూర్ ఐబీకి వచ్చి ఇంటికి వెళ్తుండగా ఎదురుగా వచ్చిన మరో బైక్ ఢీకొట్టింది. తీవ్రగాయాలు కావడంతో గమనించిన స్థానికులు మంచిర్యాల ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సంగీతరావు మృతి తీరని లోటు...

సంగీతరావు మృతి పార్టీకి తీరని లోటని కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు సూరం రవీందర్‌రెడ్డి అన్నారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈసా, ఐఎన్‌టీయూసీ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు పేరం శ్రీనివాస్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సల్వాజి మహేందర్ రావు, సింగిల్ విండో మాజీ వైస్ చైర్మన్ దామోదర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ మామిడాల రాజేశం, బెల్లంపల్లి నియోజకవర్గ నాయకుడు నాతరి స్వామి, సూరిబాబు, షేక్ అహ్మద్, శ్రీనివాస్ మృతదేహానికి నివాళులర్పించారు.

కౌలురైతు ఆత్మహత్య

పెంబి: ఆర్థిక ఇబ్బందులతో కౌలురైతు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై శంకర్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని యాపలగూడకు చెందిన అర్క సంతోష్ (28) తన కున్న ఎకరంతో పాటు మరో నాలుగెకరాలు కౌలుకు తీసుకుని అందులో పత్తి విత్తనాలు విత్తాడు. వర్షాలు కురియక విత్తనాలు మొలకెత్తక పోవడంతో పంట సాగుకు చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనస్తాపానికి గురయ్యాడు. మంగళవారం సాయంత్రం కడెం వాగు ఒడ్డున గుర్తు తెలియని పురుగుల మందు తాగాడు. స్థానికులకు సమాచారం ఇవ్వడంతో అంబులెన్స్‌లో ఖానాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం నిర్మల్‌కు తీసుకెళ్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు.

గనుల వేలంపై నిరసనల వెల్లువ

- టీబీజీకేఎస్, సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళనలు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మలు దహనం
- సింగరేణిని కాపాడుకునేందుకు ఐక్యంగా పోరాడాలని పిలుపు


మందమర్రిరూరల్: దిష్టిబొమ్మ దహనం చేస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

శ్రీరాంపూర్: బొగ్గు గనుల వేలాన్ని నిరసిస్తూ టీబీజీకేఎస్ నిరసన వ్యక్తం చేసింది. బుధవారం ఆయూనియన్ ఆధ్వర్యంలో నస్పూర్‌లోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా టీబీజీకేఎస్ కేంద్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, బ్రాంచి ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్ మాట్లాడుతూ ఎన్డీఏ ప్రభుత్వం కమర్షియల్ మైనింగ్ పేరుతో తెలంగాణలోని బొగ్గుగనులను వేలం వేసి ప్రైవేటు సంస్థలకు కట్టబెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అధికారంలోకి రాక ముందు వేలాన్ని వ్యతిరేకించిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత మద్దతిచ్చి సంస్థకు నష్టం చేసిందన్నారు. మంత్రి కిషన్‌రెడ్డి సింగరేణికి తీవ్ర అన్యాయం చేస్తున్నారన్నారు. కార్మికవర్గం బొగ్గు గనుల ప్రైవేటీకరణను అడ్డుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పానుగంటి సత్తయ్య, పొగాకు రమేశ్, అన్వేశ్‌రెడ్డి, గొర్ల సంతోశ్, ఉత్తేజ్ రెడ్డి, భాస్కర్, మల్లయ్య, సిరాజ్‌పాషా, తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు బ్లాక్‌ల వేలాన్ని రద్దు చేయాలి

కాసిపేట: కేంద్రం బొగ్గు గనుల వేలాన్ని రద్దు చేసి సింగరేణి సంస్థకు నామినేషన్ పద్ధతి ద్వారా ఇవ్వాలని ఏఐటీయూసీ సెంట్రల్ సెక్రెటరీ ఎండీ అక్బర్ అలీ, బెల్లంపల్లి బ్రాంచి కార్యదర్శి దాగం మల్లేశ్ డిమాండ్ చేశారు. మందమర్రి ఏరియా కాసిపేట–2 గనిపై 5న కలెక్టరేట్ ఎదుట ధర్నా, 8 నుంచి వారం రోజులపాటు సింగరేణి వ్యాప్తంగా అన్ని జీఎం కార్యాలయాల ఎదుట నిరాహారదీక్షలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇప్పకాయల లింగయ్య, గొల్ల శ్రీనివాస్, సుభాష్‌చంద్రబోస్, నర్సయ్య, వెంకటేష్, నీలయ్య, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.


బెల్లంపల్లిరూరల్: సీపీఎం నాయకుల నిరసన



రెబ్బెన: టీబీజీకేఎస్ నాయకుల నిరసన

బెల్లంపల్లిరూరల్: కేంద్ర ప్రభుత్వం బొగ్గు బ్లాక్‌ల వేలాన్ని వెంటనే నిలిపివేయాలని సీపీఎం ఆధ్వర్యంలో మాలగురిజాలలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి గోమాస అశోక్ మాట్లాడుతూ బొగ్గు బ్లాక్‌లను సింగరేణికి అప్పగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చల్లూరి దేవదాస్, దుర్గం సజ్జీవన్, గోమాస దేవయ్య, గోమాస రాజేశ్, దాగం శ్రీకాంత్, చల్లూరి శంకర్, తదితరులు పాల్గొన్నారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన

కాసిపేట: సీపీఎం ఆధ్వర్యంలో మల్కెపల్లి అంబేద్కర్ విగ్రహం వద్ద, సోమగూడం ట్యాంకు బస్తీలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మంచిర్యాల జిల్లా కార్యదర్శి సంకె రవి, నాయకులు సంకె రాజకుమారి, సిడాం జంగుబాయి, లింగయ్య, ప్రణయ్‌కుమార్, శ్రీనివాస్, పోశం, భాగ్య, మొగిలి, తదితరులు పాల్గొన్నారు.

పాతమంచిర్యాల: కేంద్ర ప్రభుత్వం బొగ్గు బ్లాకుల వేలం రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు దాసరి రాజేశ్వరి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం ప్రైవేటీకరణ విధానాలు విడనాడాలన్నారు. దేశ సంపదను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించే ప్రయత్నాలు మానుకోవాలన్నారు.

మందమర్రిరూరల్: బొగ్గు గనులను వేలం వేయడాన్ని నిరసిస్తూ టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్ సెంటర్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఏరియా నాయకులతో పాటు పిట్ కమిటీ నాయకులు పాల్గొన్నారు.


రెబ్బెన(ఆసిఫాబాద్): కేంద్ర ప్రభుత్వం బొగ్గు బ్లాకుల వేలం విరమించుకుని సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేస్తూ గోలేటి టౌన్‌షిప్‌లో బుధవారం టీబీజీకేఎస్ నాయకులు నల్ల జెండాలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ కమర్షియల్ మైనింగ్ పేరిట కేంద్ర ప్రభుత్వం దేశంలోని బొగ్గు బ్లాకులను ప్రైవేటు పరం చేసేందుకు వేలం వేస్తోందన్నారు. బొగ్గు బ్లాకులను వేలం వేస్తే సింగరేణి మనుగడే ప్రశ్నార్థకంగా మారుతుందని, సంస్థను కాపాడుకునేందుకు కార్మికులంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ సెంట్రల్ కమిటీ నాయకులు దారావత్ మంగీలాల్, ఓరం కిరణ్, ఏరియా కార్యదర్శి వెంకటేశ్వర్లు, సమ్మయ్య, నాయకులు సుగ్రీవులు, దేవేందర్, వెంకటేష్, మారుతి, ఖలీముల్లాఖాన్, సత్యనారాయణ, బాబురావు, కైత స్వామి, తదితరులు పాల్గొన్నారు.


పాతమంచిర్యాల: నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు


కాసిపేట: నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు


శ్రీరాంపూర్: ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

వాటర్ ట్యాంక్ ఎక్కి రైతు నిరసన


వాటర్ ట్యాంక్ ఎక్కిన శ్రీరాములు

భీమారం: పోలంపల్లి శివారులోని సర్వేనంబర్ 384లో 20 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూమిలోకి అటవీశాఖ అధికారులు రానీయడంలేదని కోట శ్రీరాములు అనే రైతు బుధవారం మండల కేంద్రంలోని వాటర్ ట్యాంకు ఎక్కి దూకేందుకు ప్రయత్నించాడు. విషయం తెలిసిన మాజీ జెడ్పీటీసీ జర్పుల రాజ్‌కుమార్‌తో పాటు అటవీశాఖ సిబ్బంది సంఘటన స్థలానికి వెళ్లి అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో కిందకు దిగాడు. అనంతరం ఎస్సై రాములు బాధిత రైతును పోలీస్ స్టేషన్‌కు తరలించాడు.

అదనపు కట్నం కేసు నమోదు

మంచిర్యాలక్రైం: దేశ వ్యాప్తంగా ఈనెల 1 నుంచి నూతన చట్టాలు అమలుకాగా మంచిర్యాల మహిళా పోలీస్ స్టేషన్లో అదనపు కట్నం కింద బుధవారం తొలికేసు నమోదైంది. గతంలో అదనపు కట్నం కింద నమోదు చేసే కేసుల్లో 498(ఏ) నమోదు చేసేవారు. కొత్త చట్టం అమలైన తర్వాత కొత్త సెక్షన్ల ప్రకారం కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై రాజయ్య తెలిపారు. పట్టణంలోని కాలేజ్‌రోడ్‌కు చెందిన నామగాని ఓదెలు–మల్లమ్మ దంపతుల కుమార్తె రమను జైపూర్ మండలం పెగడపెల్లి గ్రామానికి చెందిన బొమ్మగాని సాయిచందర్ గౌడ్ ఆరేళ్ల క్రితం పెద్దల ఒప్పందం మేరకు ప్రేమ వివాహం చేసుకున్నాడు. పెళ్లిలో వరకట్నం కింద రూ.6 లక్షల నగదు అందజేశారు. కొంత కాలంగా సాయిచందర్ గౌడ్, అతని బాబాయ్ శంకర్‌గౌడ్ అదనపు కట్నం తేవాలని వేధిస్తుండడంతో రమ మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సెక్షన్స్ 85 బీఎన్ఎస్ 3/4 డీపీఏ యాక్ట్ ప్రకారం ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

'కలెక్టరేట్ ముట్టడికి తరలిరావాలి'


ఆర్కే న్యూటెక్ గనిపై మాట్లాడుతున్న వీరభద్రయ్య

శ్రీరాంపూర్: తెలంగాణలో నూతన బొగ్గు గనుల వేలాన్ని నిరసిస్తూ ఈ నెల 5న సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాకు కార్మిక వర్గం పెద్ద ఎత్తున తరలిరావాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నేతలు పిలుపునిచ్చారు. బుధవారం ఆయూనియన్ ఆధ్వర్యంలో పలు గనులపై గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్కే న్యూటెక్ గనిపై జరిగిన సమావేశంలో ఆయూనియన్ డెప్యూటీ ప్రధాన కార్యదర్శులు కే.వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య మాట్లాడారు. తెలంగాణలోని గోదావరి పరీవాహక ప్రాంతంలో బొగ్గు నిక్షేపాలను సింగరేణి సంస్థకు కేటాయించకుండా వేలం వేయడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం నామినేషన్ పద్ధతిలో బొగ్గు బ్లాక్ లను సింగరేణి సంస్థకే ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి సంపత్, రాచర్ల చంద్రమోహన్, బద్రి బుచ్చన్న, పిట్ కార్యదర్శులు ఆకుల లక్ష్మణ్, మోతె లచ్చన్న, సదానందం, మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.

'కల్యాణలక్ష్మి' పంపిణీలో నిర్లక్ష్యం

- గడువు ముగిసేరోజే చెక్కు అందజేసిన అధికారులు


సరిత, లబ్ధిదారు


గడువు తీరిన కల్యాణలక్ష్మి చెక్కు

కోటపల్లి: లబ్ధిదారుకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కును సకాలంలో పంపిణీ చేయకపోవడంతో ఆ చెక్కు చెల్లకుండా పోయిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కోటపల్లి మండలంలోని ఎదులబంధం గ్రామానికి చెందిన జైనేని సరిత కూతురు మేఘనకు 2023లో వివాహంకాగా కల్యాణలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకుంది. మూడు నెలలుగా రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతుండడంతో చెక్కు రాలేదని సమాధానం ఇచ్చేవారు. బుధవారం చెక్కు మంజూరైందని సమాచారం ఇవ్వడంతో సరిత ఆనందంతో కార్యాలయానికి వెళ్లింది. చెక్కు తీసుకుని బ్యాంకులో వేసేందుకు వెళ్లగా గడువు ముగిసిందని అక్కడి అధికారులు చెప్పడంతో నిరాశతో వెనుదిరిగింది. ఇలా రెవెన్యూ అధికారుల తీరుతో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు.

గడువు ముగిసిన చెక్కుకో రేటు?

కల్యాణలక్ష్మి చెక్కుల్లో గడువు ముగిసిన చెక్కుకో రేటుతో కోటపల్లి రెవెన్యూ అధికారులు లబ్ధిదారులను తీవ్ర ఇబ్బందులు పెడుతున్నారు. మండలానికి మంజూరైన చెక్కులను ఇటీవల ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామితో పంపిణీ చేయించగా వాటిలో కూడా రెవెన్యూ అధికారులు చేతివాటం ప్రదర్శించారని లబ్ధిదారులు వాపోతున్నారు. కావాలని చెక్కులను ఆపివేసి అధికారులు వాటి గడువు ముగియడంతో మళ్లీ ఆర్డీవో అనుమతి కోరాలని లబ్ధిదారులకు చెప్పి ఒక్కొక్కరి నుంచి రూ.10 వేల నుంచి రూ.20 వేలు వసూలు చేస్తున్నారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇలా గడువు తీరే వరకు అధికారులు తమ వద్దే ఉంచుకుని ఆ తర్వాత పంపిణీ చేస్తే తమకేం లాభమని వాపోతున్నారు. అధికారులు ఇలాంటి ఘటనలు మళ్లీ పునరావృత్తం కాకుండా చూడాలని లబ్ధిదారులు వేడుకుంటున్నారు. ఇదే విషయమై తహసీల్దార్ మహేంద్రనాథ్‌ను వివరణ కోరగా చెక్కుల విషయంలో ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. మళ్లీ ఆర్డీవో అనుమతితో వేరే చెక్కు అందజేస్తామన్నారు.

ఉత్తమ ఫలితాలే లక్ష్యంగా విద్యాబోధన


విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో యాదయ్య

చెన్నూర్: వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా ఉపాధ్యాయులు పాఠాలు బోధించాలని జిల్లా విద్యాధికారి యాదయ్య అన్నారు. బుధవారం స్థానిక కస్తూర్బా పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులను ఆయా తరగతుల పాఠ్య పుస్తకాల్లోని ప్రశ్నలు అడిగి జవాబులు రాబట్టారు. డీఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం అమ్మ ఆదర్శ కమిటీలు ఏర్పాటు చేసిందని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల పనులు వేగవంతం చేయాలని అన్నారు. ప్రత్యేకాధికారి సుమలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అండతో రెచ్చిపోతున్న అనుచరులు!

- సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న లేఖ

మంచిర్యాలక్రైం: స్థానిక ఎమ్మెల్యే అండతో అతని అనుచరులు రెచ్చిపోతున్నారని ఆరోపిస్తూ ఓ గుర్తు తెలియని వ్యక్తి రాసిన లేఖ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. లేఖలో ఎమ్మెల్యే అండతో జగన్ మోహన్‌రావ్ రెచ్చిపోతున్నాడని, భూకబ్జాలకు పాల్పడుతున్నాడని, అతనిపై ఫిర్యాదు చేసేందుకు వెళ్తే పోలీసులు సైతం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. తిరగబడితే రౌడీ షీటర్లతో దాడులు చేయిస్తున్నాడని, మా భూమిని ఎందుకు కబ్జా చేశావని అడిగితే.. నీకు భూమి లేదు ఇక్కడికి వస్తే తల తెగిపోతుందని బెదిరిస్తున్నాడని, అతని ఆగడాలకు నేను బలై పోతున్నాని, నా చావుతోనైనా మంచిర్యాల పట్టణ ప్రజలకు కనువిప్పు కలగాలని, నాలాంటి బాధితులు చాలామంది ఉన్నారంటూ బాధితుడు రాసిన లేఖ కలకలం రేపుతోంది.

మద్యం వ్యసనం.. కుటుంబం ఛిన్నాభిన్నం

- భర్త తాగుడుకు బానిస కావడంతో తరచూ గొడవలు
- ముగ్గురు కుమార్తెలతో కలిసి పురుగుల మందు తాగిన తల్లి
- చికిత్స పొందుతూ ఇద్దరు మృతి..


గజ్జిగూడలో ప్రతాప్ ఇల్లు


అనిత మృతదేహం


రమ్య మృతదేహం

కాగజ్‌నగర్‌రూరల్: ప్రతీ కుటుంబంలో ఆర్థిక, కుటుంబ సమస్యలు ఉండటం సహజమే. అయితే ఆర్థిక సమస్యలతో భర్త తాగుడుకు బానిస కావడం ఆ కుటుంబాన్ని ఛిన్నాభిన్నం చేసింది. భర్త తీరుతో విసుగు చెందిన భార్య కుమార్తెలతో కలిసి పురుగుల మందు తాగింది. చికిత్స పొందుతూ తల్లీకూతురు మృతిచెందగా.. మరో ఇద్దరు కుమార్తెలు మృత్యువుతో పోరాడుతున్నారు. ఈ విషాదకర ఘటన కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్ మండలం గజ్జిగూడలో చోటు చేసుకుంది. గజ్జిగూడలో నివాసం ఉంటున్న ప్రతాప్, అనిత(45) దంపతులకు ఐదుగురు కుమార్తెలు సంతానం. పెద్ద కుమార్తెకు వివాహం జరిపించారు. వ్యవసాయ భూమి ఉన్నా కుటుంబాన్ని ఆర్థిక సమస్యలు చుట్టుముట్టాయి. మనోధైర్యం కోల్పోయిన ప్రతాప్ తాగుడుకు బానిసయ్యాడు. తాగిన మైకంలో విచక్షణ కోల్పోయిన ప్రతాప్ గతంలో ఒకరిపై దాడి చేశాడు. హత్యాయత్నం కేసులో అతడికి జైలుశిక్ష కూడా పడింది. ఇటీవల బెయిల్‌పై వచ్చి మళ్లీ మద్యం తాగుతూ కుటుంబ సభ్యులతో గొడవ పడుతున్నాడు. భర్త తీరుతో విసిగిపోయిన అనిత ముగ్గురు కుమార్తెలు రమ్య(16), లక్ష్మి, ఐశ్వర్యతో కలిసి ఈ నెల 1న పురుగుల మందు తాగింది. మరో కుమార్తె రవళి భయపడి పురుగుల మందు తాగలేదు. గ్రామస్తులు గమనించి కాగజ్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అనిత, రమ్య బుధవారం మృతిచెందారు. లక్ష్మి, ఐశ్వర్య మృత్యువుతో పోరాడుతున్నారు. తహసీల్దార్ కిరణ్‌కుమార్, కాగజ్‌నగర్ రూరల్ సీఐ రాంబాబు పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం కోసం మృతదేహాలను సిర్పూర్(టి) ఆస్పత్రికి తరలించారు. కాగా.. రమ్య ఈ ఏడాది ఇంటర్‌లో ఉత్తీర్ణత సాధించింది. కాగజ్‌నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకునేందుకు ప్రయత్నించినా ప్రవేశం లభించలేదు.


రోగులకు మెరుగైన వైద్యసేవలందించాలి

- మంచిర్యాల కలెక్టర్ కుమార్‌దీపక్


ఆరోగ్య మిత్రలతో మాట్లాడుతున్న కలెక్టర్

బెల్లంపల్లి: అనారోగ్య సమస్యలతో ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. బుధవారం బెల్లంపల్లిలోని 100 పడకల ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని సందర్శించారు. వార్డులు, ల్యాబ్, ఫార్మసీ, రిజిస్టర్లు, రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల స్థాయిలో వసతులు, సౌకర్యాలు కల్పించామన్నారు. రోగులు ఇబ్బందులకు గురికాకుండా చూడాలన్నారు. ఆస్పత్రిలో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలన్నారు. వర్షాకాలంలో ఈగలు, దోమలు వృద్ధి చెందకుండా చర్యలు తీసుకోవాలన్నారు. గర్భిణులు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ప్రసవం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం కాంటా చౌరస్తా సమీపంలో నిర్మాణంలో ఉన్న సమీకృత కూరగాయలు, మటన్ మార్కెట్‌ను సందర్శించారు. ప్రారంభానికి సిద్ధం చేయాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లును ఆదేశించారు.


కైరిగూడ ఓసీపీ సందర్శన


సేఫ్టీ జీఎంను సన్మానిస్తున్న అధికారులు

రెబ్బెన(ఆసిఫాబాద్): బెల్లంపల్లి ఏరియాలోని కైరిగూడ ఓసీపీని బుధవారం బెల్లంపల్లి రీజియన్ జీఎం(సేఫ్టీ) కె.రఘుకుమార్ సందర్శించారు. ఓసీపీలో నిర్మిస్తున్న ఇన్‌పిట్ క్రషర్‌ను పరిశీలించారు. బొగ్గు ఉత్పత్తి ప్రక్రియలో భాగంగా ఓసీపీలో చేపడుతున్న రక్షణ ఏర్పాట్లను తనిఖీ చేశారు. ప్రతీ ఉద్యోగి, అధికారి రక్షణ సూత్రాలు పాటించాలని సూచించారు. మొదటిసారిగా ఓసీపీ సందర్శనకు వచ్చిన జీఎం(సేఫ్టీ)ను ఓసీపీ అధికారులు శాలువాతో సన్మానించి మొక్క అందించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి సత్యనారాయణ, ఇంజనీరు రాజన్న, మేనేజర్ ప్రవీణ్ ఫాటింగ్, సేఫ్టీ అధి కారి మధుసూదన్, డీవైపీఎం వేణు, సర్వే అధికారులు దావూద్ అహ్మద్, ఏ.రవి పాల్గొన్నారు.

ఆయన చెబితే చాలు..!

- పాఠశాల నచ్చకుంటే ఖాళీ ఉంటే వెళ్లొచ్చు
- ఎస్ఏగా పదోన్నతి పొంది దగ్గరి మండలానికి వచ్చి..
- ఎంఈవో సతీమణి కావడమే అర్హతా?
- టీచర్ల బదిలీల్లో వింతపోకడలు
- ఉపాధ్యాయ సంఘాల పెదవి విరుపు



డీఈవో ఉత్తర్వుల కాపీ

మంచిర్యాలఅర్బన్: విద్యాబుద్ధులు నేర్పించే టీచర్లు దొడ్డిదారులు వెతుకుతున్నారు. పాఠశాల దూరమైతే దగ్గరకు రావడానికి ఉన్నతాధికారుల ఆశీస్సులు ఉంటే చాలు. ఇష్టం వచ్చిన పాఠశాలకు బదిలీ చేస్తూ ఓ అధికారి ఆదేశించిన సంఘటన జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ఇటీవల జరిగిన బదిలీలు, పదోన్నతుల్లో చెన్నూర్ హరిజనవాడ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఓ టీచర్ సౌజన్య కౌన్సెలింగ్‌కు యథావిధిగా హాజరయ్యారు. ఆమెకు కలమడుగు జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో సోషల్ స్కూల్ అసిస్టెంట్ పదోన్నతి లభించింది. చెన్నూర్ నుంచి వంద కిలోమీటర్ల దూరంలో ఉండటమో? ఏమోగానీ నచ్చలేదని ఆమె(ఆ టీచర్) పై అధికారులకు రిక్వెస్ట్ చేశారు. ఓ మండల విద్యాధికారి సతీమణి కావడంతో దగ్గరి మండలంలో ఖాళీగా ఉన్న హైస్కూల్ పోస్టింగ్ కోసం రిక్వెస్ట్ చేయగా ఉన్నతాధికారులు హడావుడిగా అనుకున్న చోటుకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. డీఎస్సీ ఏడీ లింగయ్య ఆదేశాల మేరకు ఇచ్చినట్లుగా డీఈవో యాదయ్య ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సదరు టీచరు కలమడుగు నుంచి వేమనపల్లి జెడ్పీఎస్ఎస్‌లో రిపోర్టు చేసినట్లుగా తెలుస్తోంది. సాధారణ ఉపాధ్యాయులకు నిబంధనలు విధించే పై అధికారులు ఇదంతా 'మాములు'గా తీసుకున్నారని తెలిసింది. ఈవిషయమై జిల్లాలోని ఉపాధ్యాయ సంఘాల నేతలు తప్పుబడుతున్నారు. బదిలీ అయిన టీచర్లు రిలీవ్ చేయటానికి నిబంధనలు సాకుతూ పాత పాఠశాలలకు పరిమితం చేసే విషయాన్ని గుర్తు చేస్తున్నారు. ఇదే విషయంపై గురువారం డైరెక్టు ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్‌కు ఉపాధ్యాయ సంఘాలు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిసింది. తప్పుడు బదిలీ రద్దు చేయకుంటే ఆందోళన చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. మరోవైపు దూరమైన టీచర్లందరూ రిక్వెస్ట్ పెడితే అనుకున్న పాఠశాలలకు వెళ్లే అవకాశం కల్పిస్తారా? అనే ప్రశ్న తలెత్తుతోంది. పై మండల విద్యాధికారి కూడా రచ్చ చేయకుండా ఉపాధ్యాయ సంఘాల నేతలను ప్రసన్నం చేసుకునేందుకు నానాతంటాలు పడుతున్నట్లు తెలుస్తోంది. ఇదే విషయమై డీఈవో యాదయ్యను సంప్రదించగా డైరెక్టర్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆదేశానుసారం ఆమెకు పోస్టింగ్ ఇచ్చానని చెప్పుకొచ్చారు.